ఆశాజనకంగా మొక్కజొన్న

- తోట్లవల్లూరు మండలంలో 3,200 ఎకరాల్లో సాగు
- పంటమార్పిడి వైపు అడుగులు

తోట్లవల్లూరు: రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. గతానికి భిన్నంగా ఆరుతడి పంటలపై మొగ్గుచూపుతున్నారు. దీంతో మొక్కజొన్నను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చని మొక్కజొన్న సాగుపై దృష్టి కేంద్రీకరించారు. తోట్లవల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న సాగును రైతులు ఎక్కువగా చేపట్టారు.

రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పాములలంక, చాగంటిపాడు, దేవరపల్లి, గరికపర్రు, ఐలూరు, తదితర గ్రామాల్లో లంక, మాగాణి భూముల్లో మొక్కజొన్న అధికంగా సాగవుతోంది. తెగుళ్ల కారణంగా మినుము పైరు ఆశించిన దిగుబడులు ఇవ్వకపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించారు. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం ఈ ఏడాది సుమారు 3,200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు.


వల్లూరుపాలెంలో మొక్కజొన్న పైరు

తెగుళ్ల బెడద తక్కువ

తరచూ పంట మార్పిడి చేస్తే, భూమిలో బలం పెరిగి మంచి దిగుబడులు రావటానికి అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. విత్తనాలు, కలుపు నివారణ, ఎరువులు, కోత ఖర్చులు కలిపి ఎకరానికి మొక్కజొన్న సాగుకు రూ. 30 వేల వరకు ఖర్చు అవుతుందంటున్నారు. నీటి కొరతను తట్టుకోవటం, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని వారు చెబుతున్నారు.

దిగుబడులపై ఆశ..

మండలంలో డిసెంబర్, జనవరి నెలల్లో మొక్కజొన్న సాగు ప్రారంభించారు. ఈ పంట 120 రోజుల వ్యవధిలో కోతకొస్తుంది. తెగుళ్ల బెడద పెద్దగా ఉండకపోవటంతో, వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి సగటున 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి. సాగు ఖర్చులుపోనూ ఎకరానికి రూ. 30 నుంచి 40 వేల వరకు ఆదాయం వస్తుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. తక్కువ కాలంలో మంచి ఆదాయం రావటంతోపాటు, పంట మార్పిడి కూడా చేసినట్లు అవుతుందని చెబుతున్నారు.

మొక్కజొన్న లాభదాయకం



మొక్కజొన్న సాగు ఎంతో లాభదాయకంగా ఉంటోంది. రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. పంట ఆశాజనకంగా ఎదుగుతోంది. ఎకరానికి నలభై క్వింటాళ్ల వరకు దిగుబడి రావొచ్చని అంచనా వేస్తున్నాను.

–మైనేని తారాచంద్, రైతు, గరికపర్రు

విస్తారంగా సాగు



మొక్కజొన్న సాగు లాభదాయకంగా ఉండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండల వ్యాప్తంగా 3,200 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది తెగుళ్ల బెడద కూడా లేకపోవటంతో పంట ఏపుగా ఎదుగుతూ కళకళలాడుతోంది.

–జి.నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి, తోట్లవల్లూరు

క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



గుడివాడటౌన్(నందివాడ) : నందివాడలో నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. తొలుత అభిషేకాలు చేశారు. విగ్రహ ప్రతిష్ట తర్వాత భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, దేశిరెడ్డి రామిరెడ్డి(అర్జున్‌రెడ్డి), రామబ్రహ్మారెడ్డి, వంశీధరరెడ్డి, నందివాడ ఎంపీపీ ఆదాం, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శశిభూషణ్, వైస్ ఎంపీపీ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. శ్రీనివాసుని కల్యాణం



నిమ్మకూరు(పామర్రు): శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా సాగింది. టీటీడీ ఆధ్వర్యాన గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆలయంలో విష్వక్సేన పూజ, హోమాలు, మహా పూర్ణాహుతి జరిగాయి. ఆలయ ప్రాంగణంలో పద్మావతి శ్రీనివాసుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రుత్వికుల వేద మంత్రాలనడుమ మంగళవాయిద్యాల మధ్య కళ్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి, ఆలయ అర్చకులు సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు, స్థానికులు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శిక్షణ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు



గుడివాడటౌన్: నిరుద్యోగ యువతకు నైపుణ్య విద్యల ద్వారా శిక్షణ ఇచ్చి వారికి ప్రోత్సాహం కల్పిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల కృషి అభినందనీయమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ ఆధ్వర్యాన కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు, కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణ పనులు



గుడివాడటౌన్: మల్లాయిపాలెం లే అవుట్లలో జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు స్పెషల్ ఆఫీసర్(హౌసింగ్) రంగారావు అన్నారు. శుక్రవారం సచివాలయ సిబ్బందితో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం 220 మంది లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టడం విశేషమన్నారు.

అద్దంకి నాంచారమ్మ జాతర

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులోని అద్దంకి నాంచారమ్మ జాతర ఉత్సవాలను తహసీల్దార్ నవీన్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ప్రధాన సెంటర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్త, కమిటీ చైర్మన్ వెంకట్రామయ్య, కమిటీ కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ప్రభుత్వ భవనాలు

కైకలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజల ముంగిటకు తీసుకురావడానికి ప్రతి గ్రామంలోనూ నూతన ప్రభుత్వ భవనాలను ఏర్పాటు చేయిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. వేమవరప్పాడులో రూ.22 లక్షల వ్యయ అంచనాతో శుక్రవారం నూతన పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నాలుగు మండలాల్లోనూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ నూతన భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్న రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు బోడావుల తిరుపతి రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చేబోయిన వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు బత్రాజు శివాజీ, గ్రామ ఉపసర్పంచ్ జాజుల రాజు, స్థానిక పీఏసీఎస్ త్రిసభ్యకమిటీ సభ్యులు పేతురు, కుక్కల కృష్ణారావు, స్థానిక నాయకులు నున్న శ్రీనివాస్, బోడావుల సత్యనారాయణ, బత్రాజు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


వేమవరప్పాడు పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్

పోలుకొండ రోడ్డు పనులు ప్రారంభం

గుడివాడటౌన్(నందివాడ): గుడివాడ– పోలుకొండ రోడ్డు అభివృద్ధి పనులకు శుక్రవారం సాయంత్రం భూమి పూజ చేశారు. ఎంపీపీ పెయ్యల ఆదాం సమక్షంలో తమిరిశ సర్పంచ్ తప్పిట ధనలక్ష్మితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఆదాం మాట్లాడుతూ గుడివాడ నుంచి పోలుకొండకు వెళ్లే ప్రధాన రహదారిలోని 2.5 కిలోమీటర్ల మార్జిన్ మరమ్మతులను రూ 2.96 కోట్లతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో రోడ్డు విస్తరణ నేపథ్యంలో పనులు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దాన్ని గమనించిన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నిధులు మంజూరు చేయించి రోడ్డును 4 మీటర్ల నుంచి 7 మీటర్లకు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అలాగే గుడివాడ నుంచి పోలుకొండ వరకు గల 12.5 కిలోమీటర్ల రోడ్డును పునఃనిర్మిస్తారన్నారు. జేఈ మహీధర్ రెడ్డి, కె.రామస్వామి, నేతలు తప్పిట సాలోమన్‌రాజు, శేఖర్, గోవాడ అశోక్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కొనసాగుతోన్న పెద్దింట్లమ్మ జాతర

కైకలూరు: పెద్దింట్లమ్మ జాతర శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. కొల్లేటికోటలో ఉదయం 5 నుంచి 6 గంటల వరకు జలదుర్గ సమేత శ్రీ పెద్దింటి అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, తృతీయవరణ కలశార్చన, పుష్పాలంకరణ, ధూపసేవ, బాలభోగం, హారతి, మంత్రపుష్పం చేశారు. ఉచిత ప్రసాదానికి ఆటపాక గ్రామానికి చెందిన వేగేశ్న ప్రసాద్ రాజు, గణపవరానికి చెందిన రుద్రరాజు పుల్లంరాజు దంపతులు దాతలుగా వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆలపాడు విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ చిన్నారుల జానపద నృత్య ప్రదర్శన, నంది అవార్డు గ్రహీత బత్తుల విజయరాణి ఆధ్వర్యాన కళారంజని ఆర్ట్స్ గుడివాడ కళాకారులతో సారంగధర చారిత్రాత్మక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.


కొల్లేటికోట పెద్దింట్లమ్మకు భక్తుల పూజలు

అథ్లెట్ అనురాధకు ఘన సన్మానం

పెడన: కోల్‌కతా నగరం మిడ్నపూర్‌లో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో రజిత పతకం సాధించిన దక్షిణ తెలుగుపాలెంకు చెందిన బండారు అనురాధను శుక్రవారం స్థానిక సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక బట్టా జ్ఞాన కోటయ్య ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అనురాధ 400 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్‌లో పాల్గొని రజిత పతకం సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించడం గర్వకారణమన్నారు. మట్టా రాధాకృష్ణమూర్తి, ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్‌బాషా, సభ్యులు పాల్గొన్నారు.


అథ్లెట్ అనురాధను సత్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రభుత్వ సేవల సూచిక బోర్డులు ప్రదర్శించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలతో సూచిక బోర్డులను తప్పనిసరిగా ఆయా కార్యాలయాల్లో ప్రదర్శించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో శుక్రవారం పంచాయతీరాజ్, మునిసిపల్, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని సచివాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను ప్రదర్శించాలన్నారు. ఏ సేవకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎన్ని రోజుల్లో ధ్రువీకరణ పత్రం అందిస్తారో కూడా అందులో పొందుపరచాలన్నారు. పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో కూడా వీటిని ఏర్పాటు చేయాలని చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం అయిన ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందజేయాలని సూచించారు. డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వై. బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

19 సార్లు యువకుని రక్తదానం

గుడివాడటౌన్: పట్టణానికి చెందిన బేబీ అశ్విత శస్త్ర చికిత్స నిమిత్తం రక్తం అవసరమవ్వగా స్థానిక షాహిద్ భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ యూత్ సభ్యులు శుక్రవారం రక్తదానం చేశారు. అశ్వితకు కావలసిన ఓ పాజిటివ్ రక్తాన్ని యూత్ సభ్యుడు రేపాణి కొండ స్పందించి రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికి కొండ 19 సార్లు రక్తదానం చేసినట్లు వారు తెలిపారు.

భూముల రీ సర్వేతో రైతులకు మేలు

తోట్లవల్లూరు: భూముల రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న సంపూర్ణ భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని గురివిందపల్లి, పెనమకూరు గ్రామాలలో శుక్రవారం డ్రోన్ ఫ్లై కార్యక్రమం జరిగింది. ఈ గ్రామాల్లో 1761 ఎకరాలలో డ్రోన్ ఫ్లై నిర్వహించినట్లు తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. పెనమకూరు సర్పంచ్ నందేటి గంగాభవాని, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శ్రీనివాసరావు, మండల సర్వేయర్ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలకు సత్కారం

పామర్రు: విజన్ లైఫ్‌సెంటర్ ద్వారా ఎందరికో సహకరిస్తున్న సాల్మన్ కొల్లాబత్తుల పలువురికి ఆదర్శప్రాయులని గ్రేస్ మినిస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్‌శామ్యూల్ దైవ కుమార్ అన్నారు. స్థానిక చాట్లవానిపురంలో సాల్మన్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కె.ప్రసన్నకుమార్, జేజే రావు, కె.ప్రేమ్‌కుమార్, కె.డానియేలు, శామ్యూల్ పాల్గొన్నారు.

మొవ్వ, పమిడిముక్కల సచివాలయాల కన్వీనర్లుగా సమ్మెట, పరసా

మొవ్వ/పామర్రు: జగనన్న సచివాలయాల మొవ్వ మండల కన్వీనర్‌గా వేములమండ ఎంపీటీసీ సమ్మెట ఆంజనేయులును, పమిడిముక్కల మండల కన్వీనర్‌గా కృష్ణాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత పరసా జగన్‌ను ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రకటించారు. వారిద్దరూ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. పలువురు నేతలు వారిని అభినందించారు.

ఉద్యోగుల చర్చావేదిక

గుడివాడటౌన్ : ఏపీ ఉద్యోగుల సంఘం గుడివాడ యూనిట్ ఆధ్వర్యాన ఉద్యోగ సంఘ నాయకులతో శుక్రవారం సబ్ ట్రెజరర్ కార్యాలయ ప్రాంగణంలో చర్చా వేదిక జరిగింది. ముఖ్యఅతిథి సబ్ ట్రెజరర్ ఆఫీసర్ జ్యోతీశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తోట వరప్రసాదు, కార్యదర్శి లోకేష్, నాయకులు పి రాము తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోదీ

సీపీఎం నేతలు

గుడివాడటౌన్: దేశ సంపదను నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థలకు దోచిపెడుతోందని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలకు ఈ ఏడాది బడ్జెట్‌లో కోత విధించి వాటిని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధానాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి టి.లక్ష్మణరావు, ఆర్ కొండ, డి.వెంకటేశ్వరరావు, రజిని, షౌకతున్నీసా, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, స్థానిక నేతలను కలుపుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చెప్పారు. పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. మండల పరిధిలోని సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులపై అధికారులతో చర్చించారు. మండలంలో డొంకదార్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వేదసుప్రద, వైస్ ఎంపీపీలు మహేష్, సీతారామయ్య, ఎంపీడీవో సుధాప్రవీణ్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

తప్పుడు రాతలు రాస్తే ఈనాడుకు శాస్తి తప్పదు

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నారాయణరెడ్డి

గుడివాడటౌన్ : వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన పత్రికలు తప్పుడు రాతలు రాస్తే శాస్తి తప్పదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు శుక్రవారం స్థానిక వాసవీచౌక్ సెంటర్‌లో ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నాయకుడు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పిలుపు మేరకు కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికి ఎల్లోమీడియా చేపట్టిన దుర్మార్గ చర్యలు పరాకాష్టకు చేరాయన్నారు. వాటిని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తొలుత వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి వాసవీచౌక్ వరకు రామోజీరావు, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు పాలేటి శివసుబ్రహ్మణ్యం (చంటి), మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహారావు, మెరుగుమాల కాళీ, షేక్‌బాజీ, చుండూరి శేఖర్, బాబీ, మహిళా మూడెడ్ల ఉమ, రమీజా, సునీత, హారిక, దేవి, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే కైలే

మొవ్వ: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పామర్రు కైలే అనిల్‌కుమార్ చెప్పారు. మొవ్వ గ్రామంలోని కల్యాణ మండపంలో శుక్రవారం మండల గృహసారథుల, సచివాలయ కన్వీనర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఏపీలో నీచ రాజకీయం చేస్తున్నాడని తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కళ్ల ముందు కనిపిస్తుంటే.. ప్రతిపక్షం దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. నాడు జన్మభూమి కమిటీల తీరును గుర్తు చేస్తూ.. నేడు వలంటీర్ల వ్యవస్థ పని తీరును వివరించాలన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై దిశా నిర్దేశిస్తూ దీని ద్వారా ప్రజలకు మరింత చేరువకావాలంటూ సూచించి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, మొవ్వ ఎంపీటీసీ దగాని బాబూజీ, సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు తాతినేని లక్ష్మీకాంత్, మండ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

సైన్స్‌పై వ్యాస రచనతో శాస్త్రీయ అవగాహన

మండవల్లి: సైన్స్‌పై వ్యాస రచన పోటీలతో విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన కలుగుతుందని సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూదాబత్తుల విజయ్‌కుమార్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో గ్రామీణ అభివృద్ధిలో సైన్స్ ప్రాముఖ్యంపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండవల్లి, లింగాల, కానుకొల్లు, పుట్లచెరువు, ఇంగిలిపాకలంక, లోకుమూడి హైస్కూల్ విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. ఐక్య వేదిక, సుధామ పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్‌పై వ్యాసరచన పోటీలు జరిగాయి. కార్యక్రమంలో టి.అప్పారావు, రిటైర్డ్ హెచ్ఎం కె.సూర్యారావు, హైస్కూల్ హెచ్ఎంలు ఎస్వై మాధవకుమార్, జి.వెంకటేశ్వర్లు


వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

జయమంగళ వెంకటరమణ

కైకలూరు: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యమని ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో.. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన తర్వాత ఆయన మొదటిసారి సొంతూరు కైకలూరు మండలం కొట్టాడ గ్రామానికి శుక్రవారం వచ్చారు. ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన చేసిన సభలో జయమంగళ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సయ్యపురాజు గుర్రాజు, ఆర్.లక్ష్మణరావు, సైదు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


కొట్టాడ గ్రామంలో జయమంగళను సత్కరిస్తున్న గ్రామస్తులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

కోనేరుసెంటర్: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయ శిక్షణ ప్రతినిధి క్రిస్సీ అన్నారు. బందరు మండలం కొత్తపూడి గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యమైన పద్ధతులు, నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్రిస్సీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమన్నారు. ఎరువులు, రసాయనాల వాడకం వలన ప్రజలు ఆరోగ్యపరంగా అనేక రుగ్మతలకు గురవుతున్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే పంటలు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలపై అన్ని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి రోజు కొత్తపూడి గ్రామంలో చేపట్టామన్నారు. సబ్ డివిజన్ యాంకర్ స్వామిబాబు, రైతులు పాల్గొన్నారు.


కొత్తపూడిలో ర్యాలీ